
భక్తులు

జీవిత చరిత్ర

కక్కయ్య జీవిత చరిత్ర




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద



"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ వీరబ్రహ్మగురు శిష్యుడైన

శ్రీ కక్కయ్య జీవితచరిత్ర



ప్రకాశకులు శ్రీ వీరబ్రహ్మేంద్రమిషన్,
ఆనందాశ్రమం, కడపజిల్లా.

విషయసూచిక

అనుబంధము

శ్రీ బ్రహ్మముగారి వేదాంతంలో

కులమత తత్త్వాలు 1.

నేటికి సుమారు నాలుగువందల సంవత్సరముల కాలంలో మన ఆంధ్ర దేశంలో ఆవిర్భవించినాడు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు. ఆయన ఆదివిశ్వ బ్రాహ్మణ వంశంలో శైవసాంప్రదాయ నిష్ఠాపరుడై జన్మించినను శ్రీమదద్వైత సిద్ధాంతాన్ని విశిష్య ప్రచారంచేయుచూ బ్రహ్మతత్త్వాన్ని నిర్దుష్టంగా ఆశ్రయించి, అందుగల సమగ్రతను గమనించి తత్ప్రాధాన్యతను తాననుభవించుచు, వేవేల జనంబులకుకూడ ఉపదేశంబులునిచ్చుచు-తనయావజ్జీవితమును బ్రహ్మకైంకర్య మొనరించి జీవసమాధి నొంది యావదాంధ్ర దేశమునకేగాక భూమండల మందంతటిలో తనపేరు ప్రతిష్ఠలు ఆచంద్రార్కస్థాయిలో నుండునటుల కీర్తిని గడించినాడు.

తాను రచించిన కాలజ్ఞాన గ్రంథంలో తానవతార మూర్తిననుచూ తన సర్వజ్ఞత్వాన్ని విపులంగా ప్రకటించినాడు. ప్రాచీన భారతీయ నాగరికతా కాలములో సంస్కృతము ప్రధానభాష, దేశీయ భాషలలో అగ్రతను పొందినది తెలుగు

భాష యావద్భారతంలో వేదములకు, శాస్త్రములకు, రామా యణ భారతాది గ్రంథములకు బహుజన ప్రాశస్త్యముకలదు. హిందూమత మీ గ్రంథముల సారమనియే చెప్పవచ్చును. పూర్వజన్మ కర్మఫలితములను జీవు డనుభవించుచుండును. సద సత్కర్మల ఫలమూలముగనే పునర్జన్మము చేకూరునన్నెడిది హిందూమతనమ్మకము. చాతుర్వర్ణముల విభాగము ఆచర ణీయమై యుండెడిది. ఆ సమయమున విదేశీ దండయాత్రలు కారణముగను తురుష్కులు అన్యోన్యము రాజ్యకాంక్షులకు లోనై దేశమునగల ఆలయ శిల్పాదికములను చిన్నాభిన్నం చేయడం ప్రారంభించారు. దీనిమూలకంగా హిందూమత స్థులుకూడా కొందరు ఇస్లాంమతాన్ని చేపట్టినారు. కొందరు క్రిష్టియన్ మతంలో ప్రవేశించినారు. ఈ పరిస్థితులలో జైన బౌద్ధమతాలు ఆవిర్భవించి అద్వైతమతాన్ని మూలకు నెట్ట వలెనని యత్నించినవిగాని, దీనిప్రాబల్యం సుదృఢంగా వుంది, అన్నిమతాలను ఆదరణతో చూస్తూ యేమతమునందు ద్వేష భావము లేకుండుటయే ఇది అడుగంటకుండుటకు ముఖ్య కారణము. ఇతర మతములలో ఇంతటి సహనశక్తి లేదనుట నిర్వివాదాంశం.

కాలం ఒకే విధముగా ఉండదని కాలజ్ఞానము తెలి సిన వారందరకు తెలుసు సాధారణ ప్రజలు ఒకేరకంగా నడు స్తుందని భావించటం కూడ కద్దు. వ్యావహారికులు ఏ కాలాని

కాగోడుగుబట్టి తమ కార్యార్థాలు సిద్ధింపజేసికొని తృప్తి పడతారు. కాని ప్రాజ్ఞులైన జ్ఞానులు తమను మరచి లోకాన్ని ఉద్ధరించే విషయంలో కంకణం కట్టుకొని నడుంబిగిస్తారు. ఆ కోవకుచెందినవాడే శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మముగారు.

దేశంలో నలుమూలలా దౌష్ట్యం ఎక్కువైంది. ఆచారాలు, వ్యవస్థలు పెచ్చుపెరిగి దుర్మార్గానికి దోహదా లవుతున్నాయి. వైదిక దైవిక సాంప్రదాయాలను అణగ దొక్కుతూ బౌద్ధమతం వెల్లుబికిన ప్రవాహంలాగా బయలు దేరి కట్టలు తెగిన నదీ ప్రవాహంలాగా లోకాన్ని భ్రష్టం చేస్తున్న ఈ మతంలోకూడ రెండు చీలికలు యేర్పడినవి. హీనయాన, మహాయాన అని. హీనయాన కృత్యములు ప్రజ లకే యేవగింపయినందున కొలదికాలములోనే దాని ప్రభా వము క్షీణించినది. మహాయాన సాంప్రదాయంలో విగ్రహా రాధనకు ప్రాధాన్యత పూర్తిగా యున్నందున శిల్పకళా వైశిష్ట్యం ఆ రోజులలో పుంజుకొన్నట్లు మరెన్నడును వృద్ధి కాలేదు. నాటి రాజశేఖరులందరు మహాయాన మార్గస్థులై ప్రజలను ప్రోత్సహించి ఆలయ పోషణము శిల్పచాతుర్య వైలక్షణంగల కళాప్రపూర్ణులను విశేషంగా ఆదుకొని పోషించి శిలాఖండాలను సుస్థిరం చేసినారు.

ప్రతిభా భాసితుడైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు జాతీయమైన శిల్పకళా వైశి

ష్ట్యాన్ని దేశదేశాలు తిరిగి ఎచ్చటెచ్చట యే యే వైభవాలున్నవో చూచి ఆనందించటమేకాక, ఆ యా స్థానములలో యుండదగిన కొన్ని పవిత్రమైన విశేషాంశములను తెలియపరచుచూ శిష్యులకు బోధలు జరుపుతూ తాను వాటిరూపురేఖలనూదిద్ది చూపుచూ దేశప్రచారాన్ని సాగించాడు.

2. కక్కుడు

ఇంతవరకు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి చరిత్రలో ముస్లిములకు హిందువులకుగల మతభేదము ఎంచదగినది కాదు. అందరును భగవంతుడొకడే, ఎవరేవిధముగ భగవంతునాశ్రయింతురో వారావిధముగభగవత్సాన్నిధ్యము నొందగలరు. దేవునకు మనుష్యునియందు విభిన్న భావములేదు. మనుష్యుడు దేవతను భిన్న భిన్నాభిప్రాయముల చూచిననూ, కొలిచిననూ, అన్ని దేవతలశక్తి అంతయు ఒకేరూపమైనది కనుక భక్తుడుపొందునట్టిఫలములో విభిన్నత యుండదనెడి విషయమును తెలిసికొనియుంటిమి.

ఈ విధముగ హిందూముస్లిము సమైక్యత శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి దృష్టిలో యేకీకృతమై బహుజన సామాన్యముగ జానపదములలోకూడా ప్రతిబింబించినది.

3. ఆధ్యాత్మ విచారణ

ఇంతటితో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారికి సిద్ధనియందు దృఢమైన శిష్యవాత్సల్యము ప్రబలిన కారణమున ఒకనాడు ఇతనికి పరిపూర్ణ ఆధ్యాత్మ విచారణ బోధను తెలుపనెంచిరి.

4. కక్కుడుం - గద్వాల మహాసంస్థానం

క్రీస్తుశకము 1650 సుమారు ప్రాంతమున నైజాము స్టేటునందు గద్వాలయను గొప్పసంస్థాన మొకటి యుండెను. ఆ సంస్థానాధీశుడు సుగుణవంతుడు, విద్వాంసుడు. అతిశయ ధన సంపత్తికలవాడు. రాజకార్య ధురంధరుడు. ప్రజాప్రభుత్వమును ముఖ్యముగ మనంబున పెట్టుకొని ప్రజలందరను తన బిడ్డలవలె పోషణ జేయుచు మంచి కీర్తినార్జించి "గద్వాల మహాసంస్థానం" అన్న పేరు గడించినాడు.

అట్టి మహాసంస్థానంలో పెద్దగంటయ్య అనునతడు నరసమ్మ అనే భార్యతో కాపురము చేయుచు ఆసంస్థానమున గుర్రాలకాపరిగ యుండెను. కొంతకాలము బంట్రోతుగ కూడ పనిచేసియుండెను. ఆ దంపతులకు సుఖముగ కాలము గడుపుచున్నంతలో అనావృష్టి కారణముగ సంస్థానమునందంతటను "డొక్కలకరువు" యేర్పడెను. కరువుతోడనే ప్రజలు

బాధపడు చుండుటకు ప్రభుత్వము విచారపడుచున్న సమయములో సంస్థానము మీదకు పొరుగు రాజులు దండెత్తి వచ్చినందున యుద్ధభయభ్రాంతులైన ప్రజలు భిన్నాభిన్నులై సంస్థానమే భిన్న మైనటులకాగా, ఈ గంటయ్య గద్వాలును వదలి శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మముగారి మఠమునకు సమీపమునగల సోమిరెడ్డిపల్లె మజరానర్సనపల్లెలోని మాదిగ వాడకు నివాసము వచ్చెను.

ఇతడు జన్మతః మతంగ (మాదిగ) కులమునకు చెందిన వాడైననూ సచ్చారిత్రుడు. తన విషయమేదో తాను చూచుకొనుటయేగాని ఇతరుల విషయాలలో జోక్యంచేసికొని అనవసర ప్రసంగాలకు లోనుగాక నీతిగ జీవనము చేయుట నేర్చుకొనెను. కాలక్రమముగ ఇతని ధర్మపత్నియందు 1) పెద్ద మునెయ్య 2) చినమునెయ్య, 3) నాగమునెయ్య 4) కక్కయ్య అనునల్గురు కుమారులు జనించిరి. కాలవశమున పెద్దమునెయ్య కలరావ్యాధితో గతించెను. రెండవవాడు చినమునెయ్య తన అన్న గతించుటకు చింతించుచూ తల్లిదండ్రుల దుఃఖమును చూడలేక క్రమక్రమముగ సంసార సుఖాపేక్షలను విసర్జించి విరాగియై సన్యాసులలో కలసి దేశాటనకు వెడలి కడప ప్రాంతములో తిరుగుచు అచటనే సమాధి స్థితుడాయెను.

5. గంటయ్య ఆవేదన

పెద్దకుమారులిరువురు యీ విధముగ తనకు గాని వారై పోవుటకు చింతించుచు గంటయ్య మూడవకుమారుడైన నాగమునెయ్యకు మంచిసంబంధముజూచి పెండ్లి జేసి మనస్సుకు సంతోషము శాంతిని కలుగుచున్న కొలదికాలము లోగా కుటుంబ పోషణ నిమిత్తము ధనార్జన జేసికొని వత్తుననుచు. నాగమునెయ్య దేశదిమ్మరి తనముతో ఎంత కాలమునకు ఇంటికి చేరనందున గంటయ్య ఆవేదన భరింపరానిదాయెను.

6. కక్కయ్య వివాహము

పై పరిస్థితులకు గంటయ్య మనసు కుందుచుండిననూ తాను పెద్దవాడై వృద్ధాప్యమువలన చేయునది లేనందున కడగొట్టుకుమారుడైన కక్కయ్యకు వివాహము చేయనెంచెను. ఎచ్చటెచ్చటనో తిరిగి తెలిసి తెలియనివారితో శ్రమపడనేరక తనకుటుంబ స్థితిగతులను,నడవడిని ఎరిగి మంచితనమును పూర్తిగ గ్రహించిన తన నివాసముగు నర్సనపల్లెలో పేరు ప్రతిష్ఠలు కలిగి పెద్దింటివారను పేరుగలిగిన హరిజనుడైన సోమిరెడ్డిపల్లె పెద్దవీరప్ప కుమార్తె మంగమ్మను కక్కనికి పెండ్లి జేసి నర్సనపల్లెలోనే స్థిరనివాసము కలవాడాయెను.

7. కర్కయ్య సచ్చారిత్రత

పెద్దవారైన తల్లిదండ్రులకు తనకంటె పెద్ద సంతానముతో కలిగిన దుఃఖమును మనస్సునకు రానీయకుండా తాను వేయికండ్లతో కనిపెట్టి తల్లిదండ్రులకు సంతోషకరములైన పనిపాటలను చేయుచు సకాలమునకు వారికి భోజనసౌకర్యములను కల్పించుచు, తన భార్యయు తానును అనేక విధములుగ సేవలు చేయుచుండెను. ఈ విధమగు సపర్యను జూచినవారల కందరకు ఇతడు "అపరధర్మవ్యాధుడు" అనుకీర్తి నార్జించ గలిగెను.

8. ధర్మవ్యాధుడెవరు?

పూర్వకాలమున కౌశికుడను నొక బ్రాహ్మణుడు పెద్దలైన తల్లిదండ్రులను వదలి పెద్ద మహిమను సంపాదించ నెంచి తపస్సునకై అడవికి యేగెను. అచట కొంత కాలము మహానిష్ఠతో తపస్సొనరించి సర్వనియమంబులను పాటించుతూ తన తపస్సు ఫలించినదని మనస్సునకు నమ్మకము కలుగువరకు ఉన్నవాడాయెను.

9. కొక్కెర చచ్చుట

ఒకనాడు కౌశికుడు తను తపోనిష్ఠనుండి లేచు సమయములో అచటి వృక్షము చివరిశాఖ యందున్న కొక్కెర

అతడు చూచుచుండగ గిలగిల తన్నుకొనుచు క్రిందపడినది. అప్పుడాతడు నా తపోదృష్టికే ఈ కొక్కెర చచ్చినదని భావించుచూ మధ్యాహ్నకాలమైనందున భిక్షకై గ్రామములోనికేతెంచెను.

10- కౌశికుడు బ్రాహ్మణిచే పరిహసింపబడుట

పిమ్మట ఒక విప్రగృహప్రాంగణమున కేతెంచి బిగ్గరగా "భవతి ! భిక్షాందేహి!" అని అరచెను. ఆగృహస్థురాలు అపుడే తన భర్త ఎచటకో వెళ్ళి అలసి వచ్చినవాడగుటచే అతని స్నానపానాదులు నిర్వర్తించి, భోజనంబిడి, కాలువత్తుచుండెను. ఆ సమయమున ఈ కౌశికుడు భిక్షయాచించుట నాలకించియు పతికి నిద్రాభంగమగునను భయముతో క్షణకాలమాగి పిదప భిక్షను తీసుకొని రాగా కౌశికుడు "ఓసీ! మేము మానులమని యెఱుంగవా ? భిక్షకై నీవాకిట ఎంతదనుక నిలువవలయును. నీకింతమాత్రము పరిజ్ఞానమే లేదా?" అని అనుట విని "ఓయీ బ్రాహ్మణా! నేను నీకుభిక్షమిడుటను తెలియని దానను కాను. నా భర్త అలసివచ్చిన కారణమున నిద్రాభంగము కలుగకుండ క్షణకాల మాలస్యమైనంత మాత్రమున నీ క్రోధాగ్నికి గురియగుటకు నేనేమి పిచ్చి కొక్కెరననుకొంటివా!" యనెను.

11. బ్రాహ్మణుడు పతివ్రతను ప్రార్థించుట

ఆ వాక్యములతో కౌశికుడు తనకుగల తపోమహిమ యెంతపాటిదో తెలిసికొనినవాడై "తల్లీ ! నీవింతటి పాతివ్రత్య మహిమ కలదాన వనుకొనలేదు. కనుక నన్ను మన్నించి నాకు మహిమోపేతమగు సన్మార్గ మెట్లు కుదురునో సెలవివ్వమని కోరెను.

12. బ్రాహ్మణి ఉపదేశము

ఓయీ కౌశికా ! నీవు జేసిన తపఃఫలంబెంతటిదో నీ వెరుంగ జాలవు. ఈ సమీపమునగల మిథిలాపట్టణమున "ధర్మవ్యాధు"డను నాతడొకడు కలడు. అతనివద్దకు వెళ్ళి నాకు జన్మసాఫల్యమగు మార్గ ముపదేశింపుమని యడుగుమని చెప్పి ఆమె లోనికి వెడలెను.

13. కౌశికుడు ధర్మవ్యాధుని వద్దకు వెడలుట

పిమ్మట కౌశికుడు అత్యాశ్చర్యముతో మిథిలా పట్టణమునకు జని ధర్మవ్యాధు డుండునది యెచటయని పాంథు నొకని యడిగెను. అతడితనితో ఆర్యా! మీకాతనితో యేమి పని? అతడీకసాయిబజారులో మొదటనే యుండునని నుడివెను. పాంథునికి జవా బివ్వకుండగనే మెల్లగ అతడుండు చోటుకు వెడలగా ధర్మవ్యాధుడచట మాంసఖండముల నమ్ముచుండెను.

అదిచూచి దిగ్భ్రాంతి చెందిన కౌశికుడు నన్నీకసాయి వాని వద్దకు బంపినదేమి? అని లోలోన ఆశ్చర్యపడుచువిషయమును తెలిసికొనగోరిన వాడగుటచే అటుసమీపమున నిలువబడి యుండెను.

14. ధర్మవ్యాధుడు బ్రాహ్మణుని గౌరవించుట

కౌశికుడు వచ్చిన విధమును తెలిసికొనిన ధర్మవ్యాధుడు వెంటనే తన విక్రయమును చాలించి కాలు జేతులు కడుగుకొని బ్రాహ్మణుని సమీపించి మహానుభావా తా మెచటినుంచి వచ్చుచున్నారు ? మీ కిచట యేమిపనియని అడిగెను. వెంటనే బ్రాహ్మణుడు ఓయీ ! యిచట ధర్మవ్యాధుడను నతనిని చూడవచ్చితినని పలుకగనే నమస్కరించి ఆ బాపని తన గృహమునకు తోడ్కొని వెడలెను.

15. బ్రాహ్మణుడు ధర్మవ్యాధుని గృహము జూచి ఆశ్చర్యమును చెందుట

క్రమముగ కొంతదూరమున యున్న తన గృహము లోనికి వెళ్ళుచూ బ్రాహ్మణుని వినయ విధేయతలతో గౌరవింపుచూ ముంగిలిదాటి లోనికరిగి బ్రాహ్మణుని యొక ఆసనమున కూర్చొన నియోగించి, లోనయున్న తన తల్లిదండ్రుల నత్యంత గౌరవాన్వితముగ పూజించి వారిని తృప్తిపరచి వారి

అనుజ్ఞ గైకొని బ్రాహ్మణుని విచారింప నతనివద్దకురాగా, అతని పితృభక్తిని జూచిన కౌశికుడు చిన్నవోయినముఖముతో మాటలాడ జాలకుండెను. అది తెలిసిన ధర్మవ్యాధుడు నేను కులహీనుడను. మహాతపశ్శాలివి, బ్రాహ్మణోత్తముడవైన నిన్ను ఆ పతివ్రతా మహాతల్లి మా యింటికి బంపిన కారణ మేమగునో ? యనినుడువగానే బ్రాహ్మణుడత్యంత చకితాంతరంగు డాయెను.

16 బ్రాహ్మణుని ఆశ్చర్యము

ఇదియేమి వింత ? నన్నీతనివద్దకా పతివ్రతా మహాతల్లి పంపినటుల యీతని కెటుల తెలిసినది. ఎంత ఆశ్చర్యము యోగవృత్తినుండి పరిపరివిధముల తపోనియముల బాటించుచున్ననూ నాకీ ధర్మసూక్ష్మ మొంతమాత్రమును తెలియకుండెనే యని విచారించుచుండగా

17. ధర్మవ్యాధుని ఉపదేశము

మహానుభావా ! చింతింపవలదు. మానవుడెన్ని జన్మములాచరించినను, ఎంత కాలము తపస్సుజేసిననూ ప్రత్యక్షదైవముల బూజింపనిదే పరోక్ష దైవతముల అనుగ్రహము కలుగజాలదు. స్త్రీకి పతియే ప్రత్యక్షదైవము. ఆ కారణమున ఆమె తన భర్తృసేవ బూర్తిగావించుకొని నీకు భిక్షనిడరాగా

నీవు కుపితుడవైతివి. నీ యజ్ఞానమును బారద్రోలు నిమత్తమూ గృహిణి నిన్ను నాకడకు బంపినది. యేజాతి మానవునకైననూ దైవములు మాతాపితరులు. వేదములు మొదలుగా సర్వశాస్త్ర ధర్మములు మాతాపితరులకంటెను మిన్నయైన దేవతలు వేరే లేరని ప్రవచించుట మీరెరుగని ధర్మముకాదు. అట్లయ్యూను నీవు నీ తల్లిదండ్రుల వృద్ధుల వదలి తపోనిష్ఠయను కారణముతో అడవులకు వచ్చితివి. అంతశ్శుద్ధి, బహిశ్శుద్ధి తెలియవలెనన్న ప్రత్యక్ష దైవతములు గురువులునైన తల్లిదండ్రుల మూలము నని తెలిసికొనవలయును కాన నో భూసురేశ్వరా? నేను కడ వాడనని యెంచక నా మాటలు మనోవీథిని దిట్టబరచి, నీవు గృహమునకేగి నీ తల్లిదండ్రుల సేవానిరతుడవుకమ్ము. నీ కన్నియు మంగళములే కాగలవని బంపెను.

18. కక్కయ్య - ధర్మవ్యాధుని మహిమ

చూచితిరా! ధర్మవ్యాధునిమహిమ. అదేవిధముగ ఇచట నీ కక్కయ్యకూడా ప్రతినిత్యము ధర్మవ్యాధునివలె ప్రత్యక్షదైవములైన మాతాపితృసేవతో పునీతుడైనాడు. అంతశ్శుద్ధి కలిగినది, అంతరాత్మ పరిమళసహిత మహాపుష్ప రాజమువలె సౌగంధము నీనుచున్నది. తన కింకేమి కావల యును. కావలసినది యోగసిద్ధి. ఇది ఎట్లు లభించునాయని ఆలోచనామగ్నుడై యుండెను.

19. సిద్ధయ్య

శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మముగారితో కొందరు శిష్యులు, పనివారు ఉంటూనే యున్నారు. పగటివేళ దైవిక, దైనికకృత్యములను నెరవేరుస్తూ, రాత్రికాలమునముఖ్యమైన బోధనా క్రమమును క్రమము తప్పకుండా ఉపదేశించే పద్ధతిని చేపట్టినారు. తాను అన్నివిద్యలలోను పూర్ణుడేకనుక, ఇతిహాస పురాణాలుకూడా వినేవారికి శ్రోత్రపేయంగా కథలు చెప్పేవారు. ప్రముఖ శిష్యులకు వేదాంత విషయాలు నిగూఢమైన రహస్యాలు ఎవరికి ఏవిధముగ ఉపదేశించవలెనో ఎరిగి వారికి ఎరుకను తెలిపి ఆనందపరచి తాను ఆనందించేవాడు. ముడమాల గ్రామస్థుడగు సిద్ధప్ప అనువాడు మహమ్మదీయ మతస్థుడు. అతడు కుటుంబపోషణ నిమిత్తం బ్రహ్మముగారి శిల్పకళాకార్యమైన రాళ్లుచెక్కుటనట్టిపనిలో ప్రప్రథమంగా శ్రీ బ్రహ్మంగారి వద్ద ప్రవేశించినాడు. నిత్యకృత్యం జీత భత్యాలు సక్రమంగా నడుస్తున్నవి. సుఖజీవనంజరుగుచున్నది.

శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారికి పనులుచేస్తూ చేయిస్తూకూడా ఇతిహాస పురాణముల కథలను చెపుతూ సంతోషకరమైన మాటలతో పనివారిని ప్రోత్సహించటం అలవాటు. తురుష్కుడైనా శ్రీబ్రహ్మంగారు చేస్తున్న బోధలు ఈ సిద్ధప్పకు వింటున్నకొద్ది అమృతప్రాయ

ముతై తానుకూడా ఎంతో దైవసాన్నిధ్యాన్ని పొందినంత ఆత్మవిశ్వాసం కలుగుతూ ఉండేది.

ఒక రోజా ? ఒక నెలా ? ప్రతినిత్యము శ్రవణము కారణముగ అతని మనస్సు ఇస్లాంమతంలో నుండి హిందూ మతంలోకి పూర్తిగా ఆకర్షింపబడినది. ఇంటి కుటుంబమునకు రికి తాను విన్నకథలను పొందుగా వినిపిస్తూ ఉండేవాడు. కాల క్రమంగా సిద్దుడు బ్రహ్మంగారిని మహాత్మా వారు గురూప దేశం చేసి నన్ను పునీతున్ని కావించుమనికొన్నాళ్లుగా ప్రాధేయ పడటం ఆరంభించాడు.

అంత మాత్రంచేతనే శ్రీవిరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాములవారు సిద్దనికి వెంటనే ఉపదేశాలు ఇవ్వలా? ఇదిగో అదిగోఅని కొన్ని సంవత్సరాలుగడుపుతూ వచ్చాడు. రోజులుగడచిన కొద్దీ సిద్దడి భక్తి విశ్వాసాలు ఎక్కువ గాజొచ్చినవి. ఇక కాలం గడిపితే నిజమైన భక్తి కలిగిన ఈ సిద్దుడుతనకుదక్కేపరిస్థితికూడా కనిపించలా!అంతటి వరకు ఉగ్గబట్టిన శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారికి సిద్దన్ని సిద్ధుడుగాచేసి దక్కించుకోవలె ననే స్థిరనిశ్చయం కలిగినది.

19. ఎ. సిద్దనికి బ్రహ్మముగారు అద్వైత విచారణను వివరించుట.

నేటి దనుక తనుచేయు పరీక్షల కోర్చి ఓపికతో భూదేవివలె సమస్త విషయములను క్షమ క్రమమున ఎంతటి

కష్టమునైననూ లెక్కచేయక పెరవారి మాటలను చెవిని బెట్టక గురువాక్యమునే భగవద్వాక్యముగను, తనజన్మకు తారకముగను భావించుచూ, నేర్పుతో ఆచరణలో పెట్టగలిగిన సిద్ధనికి నేనింతవరకు బోధ చేయకుంటిని నన్నే భగవంతునిగ నెంచిన ఈ శిష్యుని కడ తేర్చుట ఎట్లు ? అని ప్రశ్నించుకొని తానంతట తానుగా ఒకానొక రాత్రి కాలమున వాకిట కావలి వానివలెయున్న సిద్ధయ్యను లోనికి పిలిచి ఒక దివ్యాసనమున తాను సుఖాసీనుడై శిష్యుని ప్రత్యఙ్ముఖముగ కూర్చుండబెట్టుకొని ఓయీ సిద్ధా! బ్రహ్మమును జూచెదవా! అని అడిగెను.

20. సిద్ధని ప్రత్యుత్తరము

మహానుభావా గురూత్తమా ! నన్ను పరీక్షించుచుంటిరా? ఎంతవింత? ప్రత్యక్షముగ బ్రహ్మముగారగు మీరు నిజమైన బ్రహ్మమై యుండ నేనిక ఎచట ఏ బ్రహ్మమును జూతును, నాకింకొక బ్రహ్మ మెక్కడ జూడనున్నాడు. మీ పాదమే నాకు పరబ్రహ్మమని యనగానే, ఇతని శిష్యత్వస్ఫూర్తికి ఆనందపడినవారై శాస్త్రక్రమమున షట్చక్రరూపణ ముపదేశింప నారంభించెను.

21 కక్కడు బ్రహ్మముగారి ఉపదేశమునువినుట

పితృసేవా పరాయణుడైన కక్కడు పగలంతయు గృహకృత్యనిర్వర్తనమునకు గావలసిన ద్రవ్యసంపాదనకు గ్రామ

పెద్దలగు రైతులవద్ద కష్టించి కుటుంబ పోషణముచేయుచు, రాత్రి కాలమున గ్రామరక్షణ యుద్యోగమును సంపాదించినవాడై అర్ధరాత్రివేళ దొంగల గొడవలు జరుగకుండ వీథులన్నింటిని తిరుగుచుండును.

నాటి రాత్రియందు కూడ నదేవిధముగ గ్రామ మొగినయున్న శ్రీవిరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి యింటి సమీపమునకు వచ్చుచుండ లోపల సందడిగ నుండుట కనిపెట్టెను. ఇటనేమి జరుగుచున్నదో? లోపల గుసగుస లేమైయుండును? దొంగ లెవరైన ప్రవేశించి నారేమో యనుకొని, నిశ్శబ్దముగ మెల్లమెల్లన గోడవద్దగల చిన్న *"సారగూటి" వద్దచేరి గోడకు చెవినాన్చి శబ్దమును వినసాగెను.

22. ఇంటిలోని బోధనల నాలకించుట

సిద్దయ్య : గురుదేవులకు సమస్కారములు.

బ్రహ్మం : దీర్ఘాయుష్మాన్ భవ.

సిద్ధయ్య : దేవా! తమకు నేటికి నాయందు అనుగ్రహము కలిగినది.

---

*. సారగూడు : స్వర్ణకంత : (గోడకు ఉండునట్టి చిన్నరంధ్రము)

బ్రహ్మం : బిడ్డా! నీ పూర్వజన్మ కర్మఫలం నేటితో పాప శేషం నిర్మిశేషమై, సుకృత ఫలం నిండుగ పండిన దోయి.

సిద్దయ్య : ఇది ఇట్లగుటకు మీ కరుణాకటాక్షమే కారణము కాదా ?

బ్రహ్మం : నీ మనోభావము నెవరు కాదనగలరు ?

సిద్దయ్య : గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః !
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః॥
ఇదియేకదా ? సకలవేద సారము. ఇంతకంటెను ఘన మైన మంత్రరాజ మింకొండు కలదా స్వామీ ?

బ్రహ్మం : చిరకాలమునుండి గురుసేవ జేసినందులకు తగిన సత్సాంప్రదాయ మహాదర్థము నెరింగితివి. ఇక తెలియ వలసినది ఇంచుక మాత్రమే కలదు. దానిని ఇపుడు ఉపదేశించెదను. సావధానముగ వినుము.

సిద్దయ్య : ఈ ఉపదేశము నేమనియెదరు గురుదేవా ?

బ్రహ్మం : షట్చక్ర నిరూపణమందురు.

సిద్దయ్య : కృతార్థుడను - ఈచక్రనిరూపణ నాధ్యాత్మిక దృష్టితో తెలియవలెనని ఎంతకాలము నుండియో ఉవ్విళ్ళూరు చుంటిని.

బ్రహ్మం : నీకోర్కె క్షణకాలములో నెరవేతును. వినుము.

దీనిని మూలాధారమందురు. మనుష్యుని (దేహి)శరీరము పంచవింశతి తత్వాంబులచేతను, దశ నాడులచేతను కప్పబడినదై నేడు కమలములతో కూడియున్నది.

చిదానంద మయమైనట్టియు సర్వవశ్యమును చేకొనునట్టియు, బ్రహ్మాత్మానుభవరూపమైన ఈ భక్తి భావమంతయు వినుము. నేను జూపించబోవు నది నిర్మల మనస్సుచే బరికింపుము. లోకమునందు సూర్యుని కిరణములు మేధ్యాఽమేధ్య వస్తువుల నెన్నిటిని దగిలిననూ ఆకిరణములకు గల పవిత్రత సూర్యునికిగల ప్రకాశమునకు ఏవిధముగా అంటక దివ్యత్వము చేతనే వెలుగొందు చుండునో అదే విధముగ ఘటజలములందు ప్రతిబింబించిన సూర్య కిరణంబులు ఘటజలమునందుండు రంధ్రంబులు, జలమునందుండు కల్మషములనెటులనంటవో తద్విధంబుననే - పరమాత్మకు స్థూల దేహంబునగల దుర్గంధాదుల సూక్ష్మదేహంబున జనించు కామ క్రోధాదులును కారణదేహంబున గల అజ్ఞానము కూడ పరమాత్మకు అంటవు.

సద్గురుసేవజేసి శాస్త్రరహస్యంబులు విచారించువారికి సూక్ష్మ దృష్టిచేత (దీనినే జ్ఞానదృష్టి

యందురు) ఈ దేహమునందే పరమాత్మ దర్శనము అగును. తత్క్రమమును దెలిపెద వినుము.

23. షట్ చక్ర నిరూపణము

1. మూలాధారము

గుదస్థానమునందు నాలుగు రేకులు గల్గి పచ్చనయిన వర్ణముగలదై వ, శ, ష, స అను నాలుగు దళములతో గూడుకొని 'న' కారంబు గలదై పృథ్వీనిలయంబై ప్రాణాకారణంబై భూమివలెనే నాలుగుకోణంబులు గలిగియుండును. ఆచారలింగము యిచ్ఛాశక్తితో నుండును. 1 ఘ, 40 వి.ఘ. కాలములలో 600 పరమ హంస జపము జరుగును. ఈ చక్రమునకు వినాయకు డధినేత.

2. స్వాధిష్ఠాన చక్రము

ఆధారచక్రంబునకు రెండు అంగుళములపైన నాఱు రేకులుగలదై మూడు కోణంబులు గల్గి 'మ' కారంబుతో గూడుకొని తెల్లని రంగుతో జలస్థానంబై జిహ్వాకారంబై బ,భ, మ, య, ర, ల యను దళంబులు గలదై పక్షి యాకృతి గానుండును. గురులింగ క్రియాశక్తి. ఈ చక్రమున బ్రహ్మ దేవునకు 16 ఘ. 40 వి.ఘ. కాలములో 6000లు పరమహంసల జపము జరుగును.

3. మణిపూరక చక్రము

స్వాధిష్ఠాన చక్రమునకు పైన మూడు అంగుళముల మీద నాభియందు నాడులను చుట్టుకొని మణికాంతివలె ప్రకాశించుచు నీలవర్ణముగలదై 'శి' కారయుతమై త, డ. ణ, త. థ, ద, ధ, న, ప, ఫ యను పదిదళంబులు గలదై తేజోని వాసంబై నేత్రకారణంబై పీఠికాకృతిగలిగి యుండును. దీనికి విష్ణువు అధిష్టానదేవత. శివలింగం జ్ఞానశక్తి అగ్ని ముద్ర,నాగో ర్ధ్వస్థానము 16 ఘ. 40 వి.ఘ. 6000 పరమహంసలు జపము జరుగును.

4. అనాహతచక్రము

మణిపూరక చక్రంబునకు పది యంగుళములపైన హృదయ స్థానమందు పండ్రెండు దళంబులు గలిగి సువర్ణ చ్ఛాయతో, 'వ' కారముగలదై సమస్తవాక్యంబులకు స్థానమై క, ఖ, గ, ఘ, ఙ,చ, ఛ, జ, ఝ, ఞ ట, ఠ,యను దళములు గలదై వాయువునకు స్థానమై త్వగింద్రియకారణంబై లింగా కృతిగలిగి యుండును. దీనికి రుద్రుడు అధిష్టానదేవత. చద రంగము బీజశక్తివాయు ముద్ర నాదప్రకాశినీ స్థానం 16 ఘ. 40 వి. ఘ లలో 6000 పరమహంస జపము జరుగును.

5. విశుద్ధచక్రము

అనాహత చక్రమునకు పన్నెండు అంగుళములపైన తెల్లని కాంతి గలదై అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ,

ఞ, ఞా, ఎ, ఐ, ఓ, ఔ, అం, అః, యను పదియారు దళం బులుగలదై చేపవంటి యాకృతిగలదై గగనసదనంబై శ్రోత్ర స్థానంబై కంఠస్థానమందుండును. దీనికి జీవుడు అధిష్ఠాన దేవత. సరస్వతిస్థానం. ప్రసాదలింగం, ఆదిశక్తి, ఆకాశముద్ర, జ్యోతి వర్ణము. 2 ఘ. 48 వి. ఘ. 1000 జపము జరుగును.

6. ఆజ్ఞా చక్రము

విశుద్ధ చక్రంబు మొదలు పన్నెండు అంగుళముల పైన భ్రూమధ్యస్థానమందు. 'హంక్షం' అను రెండు దళంబులు గలదై అంతఃకరణ భవనంబై అగ్నివలె ప్రకాశించుచుండును. దీనికి ఈశ్వరుడు అధిష్టాన దేవత. సర్వసృష్టిస్థానము మహా లింగం పరాశక్తి సువర్ణవర్ణం ఆకాశముద్ర 2 ఘ. 46 వి. ఘ. లలో 1000 పరమహంసల జపము జరుగును.

7. సాహస్రారము

విశుద్ధ చక్రంబునకు పైన బ్రహ్మరంధ్రమందు ఉండును. ఆ సహస్రారమందు తేజోమయ రూపమైన సహస్ర దళములతో గూడుకొని 'ఓమ్' అను ప్రణవము వర్ణకంబయి దేదీప్యమానముగ బుద్ధికి నిలయంబై మాయచేత గప్పంబడి సమస్త జగత్తునకు గారణమై యథార్థముగా విచారించిన సృష్టిలేనిదయి సచ్చిదానంద స్వరూపముగలదై యున్నది.

దీనికి అధిష్టాన దేవత శ్రీగురుమూర్తి. ఓంకార లింగం, జ్యోతిర్మయస్థానం సర్వాకర్ష, ప్రణవస్థానం, విమలజ్ఞానముద్ర 2 ఘ. 46 వి. ఘ.లలో 1000 పరమహంస జపము జరుగును. ఈ ఏడు చక్రంబులు దెలిసికొనిన సాక్షి తానైయున్నది. ఈ చక్రంబుల యందు దిరుగు వాయువు "ప్రాణం" బని చెప్పంబడును. ఈ వాయువు స్థానభేదముచేత పది విధంబులై ప్రకాశింపుచున్నది అవి యెవ్వియనిన :- ప్రాణవాయువు, అపానవాయువు, వ్యానవాయువు, ఉదానవాయువు, సమానవాయువులను నైదు ప్రాణవాయువులున్ను, నాగవాయువు, కూర్మవాయువు, కృకరవాయువు, దేవదత్తవాయువు, ధనంజయవాయువులును నుపవాయువులైదును గలసి పదివాయువులు. గాంధారి మొదలైననాడులు పదివాయువులందున దిరుగుచుండును. ప్రాణవాయువు కుడిఎడమలందును ఇడాపింగళులను నాడులందు దిరుగుచు క్రిందికి మీదికి నడచుచుండును. ఇడాపింగళ లాధారము మొదలాజ్ఞా చక్రము వరకుండును. మధ్యనున్న సుషుమ్నానాడి యాజ్ఞను దాటి బ్రహ్మరంధ్రపర్యంతము వ్యాపించి రహస్యమైనదై దేహ మధ్యమందు ప్రధానమై యుండును. ఈ నాడులందు దిరుగుచున్న జీవుడు ప్రాణవాయువువలన నాజ్ఞా చక్రమందు బుట్టిన 'స' కారమున్ను మూలాధారమందు అపానవాయువు వలన బట్టిన 'హ' కారమున్ను కలిపి 'హంస' యనియు, 'సోహం' అనియు

నూర్ధ్వసుధాకుండలులందు వ్యాపించుచున్న ఆత్మమంత్రము
నాధారాది షట్చక్రముల కధిష్టాన దేవతలైన గణపతి, బ్రహ్మ
విష్ణు, రుద్రుడు, జీవుడు, ఈశ్వరుడు వీనిని గూర్చి ఈ ఉదయము
మొదలు మరునాటి ఉదయము వరకు జపముజేసి యర్పణ
జేయుచున్నాడు. అందు గణపతికి 600 లున్ను, బ్రహ్మకు
6000లున్ను, విష్ణువునకు 6000లున్ను, జీవునకు 1000న్ని, ఈశ్వరు
నకు 1000న్ని, సగుణముగ భగవదర్పణ చేయుచున్నాడు. సహ
స్రారమందు తేజోమయ రూపమైన 1000 హంసలను శ్రీగురు
పరమాత్మ కర్పణ చేయుచున్నాడు. ఇట్లు సగుణ, నిర్గుణ
రూపములైన హంసలు 21600. ఈ రహస్యమును జీవుడు కను
గొనలేక శ్రీగురుసేవ చేయక కాశీ, గయ, ప్రయాగ మొద
లైన తీర్థయాత్రలకు బోవ ప్రయత్నించి సారూప్యాది ముక్తు
లను గోరుచు వాని విస్తృతమై కాలమంతయు వ్యర్థముగ
గడుపుచుండును. ఇందువలన దేహి ఆడుచున్న బంతివలెనే
క్రిందికిమీదికి దిరుగుచూ సుఖదుఃఖంబులకులోనై పుట్టుచు
చచ్చుచు నుండును. ఆ సహస్రారమే శబ్దరూపమైన వాక్కు.
అదే పరంజ్యోతి, అదే యూర్ధ్వకుండలి. అదే అమృతమునకు
స్థానము. అదే సంయుక్తసృష్టికి కారణము. అది మెఱుపు
వలెనే కొంచెము కాలములో గనుపడి అప్పటి కప్పుడే కప్ప
బడును. ఆసహస్రారమందే అవ్యక్తాది సమస్త సృష్టియున్నది.
దానియందు 'తానకు' అనగా సమస్తమును చిద్విలాసమై

యుండును. అప్పుడీ జీవునకు ఏ దోషంబును అంటదు. ఇట్టి మార్గము దెలియలేక అధోకుండలియందుబడి దారా పుత్రాదులు తన్ను రక్షించెదరని వలలో బడిన పిట్టవలెనే ఈ దేహమందున్న అమృతపానమును జేయలేక ఈదేహమే నేననుకొని కొట్టుకొనుచుండును. దీనిలో జీవుడు తనకంటె వేరైన వస్తువు కలదని తన నేర్పుకొలది కర్మభక్తులను జేయుచు కర్మకాండలో మునిగియుండును. అంటుకుండను గంగలోముంచిననూ ఎట్లు పవిత్రంబుగాదో యటువలెనే యీ దేహమును ఎన్నిసార్లు గంగలో ముంచిననూ, బాహ్యదృష్టిచే ఎన్నికర్మలు చేసినను మోక్షమురాదు. కనుక ఆధ్యాత్మిక దృష్టితో అంతర్గత జీవాత్మను దర్శించుటయే మోక్ష మార్గము.

24. కక్కయ్య దైవమును ప్రత్యక్షముగ జూడగోరుట

జన్మ జన్మాంతరంబులయం దెన్నియో సుకృత విశేషంబున జేసియున్నగాని దొరుకడు సద్గురువు. అట్టిసద్గురుని సంపూర్ణ ఆధ్యాత్మిక ఉపదేశమును గోడకు చెవియొగ్గి వినిన కక్కయ్య అదృష్టము నేమనవలయును.

తన ఇంటిలో తల్లిదండ్రులకు జేసిన సేవాధర్మము తప్ప ఇతర ధర్మములేవియు ఎరుగని కక్కయ్యకు ఈనాడు ఇంతటి దివ్యమగు ఆధ్యాత్మికబోధ ఎన్నిజన్మముల సుకృత విశేషమై యుండవలయును? మహాత్ములకు కూడా అందని

విషయమీతనికి అందినది. మహర్షులు ఈ ఆధ్యాత్మిక విషయములనెన్నియో పర్యాయములు వినుచు,అభ్యసించుచూ కూడ నిశ్చయ బుద్ధికి రాజాలరు. అదియే వారి ప్రారబ్ధము.

కక్కని కటులగాక? ఏక మాత్రోపదేశ శ్రవణ మాత్రమే పూర్ణమగు మనోనిశ్చయము దైవమునందుకలిగినది. ఇదియే మూఢభక్తి లక్షణము. నాకీనాడే భగవద్దర్శనము కాగలదు. నే నిపుడే ఇంటికిజని, నాభార్య దేహమును కోసి చక్రములు, దేవతలు, ఎచ్చటెచ్చట యేవిధముగ నుండిరో ప్రత్యక్షముగ జూతుననుకొనుచు గృహమునకు వెడలెను.

25. గృహంబున గృహిణి నిద్రించుచుండుట గర్భచ్ఛేదనము

ఈతని మనోధైర్యమునకు తగినట్లు పతివ్రతామతల్లియైన ఈ కక్కని భార్యఅర్ధరాత్రి సమయంబగుటచే ఒడలు తెలియని నిద్రలో నున్నది. కక్కడు ఇదియే మంచి సమయమనియెంచి పదునగు కత్తితో భార్య గర్భకోశము మొదలు కంఠము పర్యంతము కోసి జూచెను.

26. శరీరంబున దేవతలు కనిపించకుండుట

దైవదర్శనావేశంబున ఇట్లు జేసిన కక్కనికి భార్య దేహంబున మాంసకృత్తులేగాని దేవతామూర్తు లెచ్చటను కానరాలేదు.

27. కక్కని దుఃఖావేశము

ఏమి చిత్రము ? సద్గురూపదేశ నిశ్చయ మన స్కుడనై, దేహభాగంబున షట్చక్ర దర్శనమును అందుండు దేవతలను దర్శింప నెంచిననాకు రక్తసిక్తమైన మాంసఖండం బులు తప్ప దేవతలే కనిపించకుండిరి. ఇదియేమి అన్యాయము. నాకీ దుర్బుద్ధి ఎందులకు జనించినది. అపర దేవతవలెయున్ననా యిల్లాలును నేడు నేను నాచేతుల మీదనే చంపుకొనినవాడ నైతినే. భార్యామరణము స్త్రీహత్యా పాతకము నన్ను వెన్నంటి నా జీవితమంతయు అధఃపతనంబగుసమయ మాసన్న మైన నేనీ నీచకార్యము దలపెట్టితినని బహువిధముల దుఃఖిం చుచూ, కొంతమేరకు కృతనిశ్చయుడై పరుగుపరుగున శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి సన్నిధికి ఏతెంచెను.

28. కక్కని హృదయమున శాస్త్రధిక్కారము

తాను శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి గృహమువద్దకు వచ్చువరకును అచట లోపల మరల మరల నీ అద్వైతచర్చ జరుగుచనే యున్నది. కాని మరల వినినను అదే ఉపదేశము వినిపించుచుండుటచే కక్కని హృదయమునుండి మహాప్రళయమారుత క్షుభిత పుష్కలా

వర్తక వృష్టిభంగి దుఃఖాశ్రువులు రాలుచున్నవి. ఆవేశ పూరితమైన అతని హృదయమునుండి రకరకములగు ప్రశ్న పరంపరలు వచ్చుచున్నవి. నేనెవరిని? నన్ను ఎవరు పిలిచిరి? నా స్వకార్యమును నేను నిర్వర్తించక ఇట్టి పనికిమాలిన పనికి యెందుకు పూనుకుంటిని? గురువులా? గురువులు? దొంగ గురువులు, బూటకపు గురువులు, దేశద్రోహులు, ఏ పాప మెరుగని ప్రజలను లోబరచుకొని, ధనద్రవ్యాపేక్షకై మేము జగద్గురువులమనుచు, ద్రవ్యంబుల నార్జించుచూ, బ్రహ్మము నెరుంగుదుమనుచు, బ్రహ్మవిద్యకు మించినవిద్య లేదనుచు, బ్రహ్మవిద్యపేరిట,పొట్టచేతపట్టుకొనిఇంటింటికి భిక్షాటనంబునకు బోయి ద్రవ్యములనపహరించు ఈ బూటకపు గురువుల నెంత మాత్రము నమ్మరాదు.

నా ప్రాణములో ప్రాణమై బంగరు బొమ్మవలె సకల సౌందర్య శోభితురాలై, కంటికి రెప్పవలె అన్ని గృహ కృత్యములలోనూ నావెన్నుముకవలె యొప్పియున్న ధర్మ పత్నిని నేడు యీ బూటక నాటక వేషధారియైన బ్రహ్మము మాటనునమ్మి భార్యను వమ్ముచేసి కొంటిని. నేనిప్పు డీతని యెదుటబడి యేమని యడుగుదును? నే నెవడనో వారికి తెలి యదుకదా? నీ భార్యనెవరు చంపమనిరయ్యా? అని అడిగినచో ఏమి సమాధానము చెప్పగలను? అని వితర్కించుకొనెను.

29. కక్కయ్య బ్రహ్మముగారి వద్దకుపోవుట

ఎట్టకేలకు శ్రీవిరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి గృహప్రాంగణమునుండి పోతులూరూ ! గురుదేవా ! అనుచు పెద్దగ కేకవేసెను. ఆధ్యాత్మ చింతనలో యుండినవాడైననూ లోనివారలకు, వారికి కేక వినబడక పోలేదు. ఈ కేక ఆర్త నాదముతో కూడియున్న దగుటచే, వినుచునే బ్రహ్మముగారు చటుక్కునలేచి నిలబడి ముఖ ద్వారముకడకే తెంచిరి. ఆర్త త్రాణపరాయణులలక్షణమిట్టిదియే కదా ? మున్నొకచో మకరేంద్రునిచే పీడింపబడిన గజేంద్రుని ఆర్తినివిని శ్రీమన్నారాయణుం డిటులనేగదా గజేంద్రుని కడకు వేంచేసి రక్షించినాడు.

ధ్యానాసక్తులైన శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాముల వారికికక్కని కేక హృదయాంతరాళమును కదలించినది. కరుణారసమునిండి కావేరీ ప్రవాహమువలె పొర్లినది. ఒరులు విన్నవించకుండగనే ఏదో మహాదాపద ఆసన్నమైనటుల తెలిసినది. ఇటుజూడ ఈ కడజాతివానికీ అర్ధరాత్రమున గల్గిన ఆపదఎట్టిది ? ఎందులకింతటి కేకయని హృదయమాందోళితమైనది ? అంతర్దృష్టిం జూచిరి.

కడజాతియా ? ఏది కడజాతి ? ఏది మొదటిజాతి ? ఈ జాతి విభేదము లెట్లు కలిగినవను వితర్కము కూడ హృదయమున గోచరించక పోలేదు.

30. శంకరభగవత్పాదులు

పూర్వమొకప్పుడు శ్రీశంకర భగవత్పాదులు కాశీ మహాక్షేత్రములో ప్రాతఃకాలమున గంగాస్నాన జపానుష్ఠానాదులు నిర్వర్తించుకొని మధ్యాహ్నసమయమున శ్రీవిశ్వనాథుని దర్శించు నిమిత్తము భగవదాలయమునకు వచ్చుచున్నతరి శంకరుని శిష్యులు ముందునడచుచుండిరి. మధ్యలో కొంత దూరము వచ్చి పిదప త్రోవమధ్యనుండి ఒక మాదిగవాడు శ్రీశంకరునకు ఎదురైనాడు. ఆ గొంది చాలాచిన్నదగు గొందియగుటచేత శంకరుని శిష్యులు మాదిగవానితో ఓయీ! శ్రీశంకరులిటు వచ్చుచున్నారు. నీవు త్రోవలో అడ్డము రారాదు. వెనుకకు తొలుగుమని యనినారు.

అపుడాతడు స్వాములారా? స్వాములవారు వెళ్ళుటకు నేను తొలగవలసిన పని యేమున్నది. వారటు వెళ్ళుదురు. నేనిటు బోయెద. ఇందుకేల సందేహ? మనెను.

అందులకా భూదేవతలు ఓయీ నీవుకడజాతివాడవు. స్వాములవారా బ్రాహ్మణులు. అందునను యతీశ్వరులు. వారినంటుచూ కొలది ప్రదేశములో నీవెటుల వెళ్ళగలవోయి ! అనిరి.

అదివినిచండాలుడు ఓ ఉత్తమోత్తములారా తొలగవలసిన దేది? దేహమా? జీవమా? దేహము తొలగినచో

జీవునకు స్థానమే లేదుకదా ?జీవుడే తొలగుచో దేహము చలిం పదు. (నడువదు) కదా ? ఇందేది తొలగ వలసియున్నదో మీ శంకరులను నిశ్చయింపమనుడి ? అని నుడువగనే, శ్రీశంకరు డాతనిప్రశ్ననందుకొని వివిధవ్యాఖ్యానముగల శాస్త్రసూత్రము లను పలుకగా, అన్నిటకు నాతడు సరియైన సమాధానముల నిచ్చుచునే యుండెను. వానిని వినిన శంకరుడు ఈతడు చండాలుడుకాడు సాక్షాత్ శ్రీవిశ్వనాథుడేనని నిశ్చయించు కొని అతని పాదములకు మ్రొక్కుచు

"చండాలోస్తు సుతద్విజోస్తు
గురురిత్యేషా మనీషా మమ" అనుచూ

విశ్వనాథుని బహువిధముల సన్నుతించెను. అపుడా కాశీ నాథుడు ప్రత్యక్షమై శంకరా ? అభ్యాసమునందుకూడ కలదో లేదోయని చూచుటకై యేతెంచితినేగాని, వేరొకటికాదు. నీ యంతరంగము పరబ్రహ్మ పరిపూర్ణమైనదని తెలిసికొంటిని అనుచూ అంతర్హితుడాయెను.

అలాగుననే నేటి మన శ్రీవిరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాములవారు ఈ విషయములోకూడ ఆధ్యాత్మ విచారణా ప్రసంగము బోధనమువరకేనా లేక అనుభవసిద్ధమో తెలియుటకే కక్కనిద్వారా యీతని సచ్చారిత్రము పవిత్రమగు అంతరాత్మ,భక్తవాత్సల్యత అవగతమగుటకై ఈ పరిణామము వచ్చినది.

కక్కనికేమి బోధ ? అనుచుండిరి ఒకవైపున శిష్య వర్గము, ప్రజలుకూడ. ఏకలవ్యునివలె యీతడు బ్రహ్మము గారికి సిద్ధుని కంటెను ముఖ్యమైన శిష్యత్వము నేర్పరచుకొని ప్రాణము పణముగబెట్టి బ్రహ్మముగారి గురుత్వమును లోకము నకు చాటుట బహు విచిత్రముకదా ?

ఎవ్వరేమనిననూ ప్రస్తుత స్థితిలో కక్కని రక్షించి కృతార్థుని చేయవలెనేగాని ఉపేక్షించినచో నిక నేమైన యుండునా ?

31. బ్రహ్మముగారు కక్కని గృహమునకు వెడలుట

శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఎవరిమాటల నెంతేని లక్ష్యము చేయలేదు. అతడే జాతి వాడైననూ అతని ఆధ్యాత్మవిద్య పరిపక్వదశకు వచ్చినది కనుకనే ఇంతపని జరిగినది. లోకమున ఇట్టిపరీక్ష నెవరేని జేసి యుండిరా ? అని తలపోయుచు ఓయి శిష్యా ? భయపడకుము. చెడినదేమియును లేదు. ఇదిగో ఇపుడే నీ వెంటవచ్చుచున్నాను. నీవు వినిన ఆధ్యాత్మిక తత్వమంతయును నిశ్చయమైనదే ! ఇందావంత మోసములేదు. నేను నీవనుకొనినటుల బూటకపు గురువును కాదు.



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారు
మాదిగ కక్కయ్య గృహంబునకువచ్చి అతనిభార్యను బ్రతికించుట-
జ్ఞానోపదేశము చేయుట

మనమిక ఒకక్షణమైన నాలస్యముచేయవలదు. అని హెచ్చరించుచు కక్కని గృహమునకు వెడలి, సిద్దా! చూచితివా ఈతడు చేసిన ఘోరకృత్యము. కనులుమూసికొని అంతర్ దృష్ట్యా ఆధారాదులను నిరీక్షించవోయి? అనిన వాక్యమును ప్రత్యక్షముగ జూచుట కింతపని చేసినాడు.అనుచు

32. షట్చక్రముల వివరించి చూపించుట

ఓయీ కక్కా! ఇటురమ్ము. ఇదిగో చూచితివా మూలాధారము. ఇదిగో ఇవియె పద్మమునందలి చతుర్దళములు. వీనియందివియే అక్షరంబులను భావనాశుద్ధితో దర్శించవలెను. ఇతడు గణపతి. ఇదియొక చక్రము.

2. ఇదియే స్వాధిష్ఠానము. ఇంచారు దళంబులు,వీని మధ్యయున్న బ్రహ్మఇదిగో చూడుము.

3. ఇది మణిపూరకచక్రము. ఇందలి దశదళంబులివియె, ఇందుండు విష్ణువితడే, చూచితివా విష్ణుతేజస్సును చక్కగ పరికింపుము.

4. ఇది అనాహతము. ఇందు పంద్రెండు చక్రముల మధ్య రుద్రుడు వెలుగొందుచున్నాడు.

5. ఇది విశుద్ధచక్ర మిచటి పదియారు దళంబుల మధ్య జీవుడు దీపశిఖవలె వెలుగొందుచున్నాడు.

6. ద్విదళంబులుగల ఆజ్ఞాచక్రంబిదిమో, సూర్య చంద్రాఽభిన్నంబగు పరమాత్ముని తేజం బిచట దర్శనమిచ్చు చున్నది.

7. ఇది సహస్రారము. ఇట వేయి దళంబులమధ్య కోటి సూర్యప్రకాశమానుండైన శ్రీసద్గురుమూర్తి గోచరించు చుండెను గదా ?

ఇటులసద్గురుమూర్తి తానుస్వయముగ చక్రములను తదధిపతులను చూపింపగనే తన్మయత్వమునందు మునిగిన కక్కయ్య సిద్దయ్యయు బ్రహ్మానంద భరితులైరి. ఒడలెరుంగని మహదానందాంబుధి నోలలాడిరి. కొంతసేపటికి ఉన్మీలిత నేత్రులై సత్ గురుకటాక్షమున నేడు మా జన్మంబులు తరించి నవి. ఇట్టి మహానుభావులేగదా ? నిజమైన గురూత్తములు.

33. కక్కయ్య దేవతామూర్తుల దర్శించుట

మీ పరిపూర్ణానుగ్రహముచేత మేమీ చక్రముల యందలి దేవతామూర్తులను దర్శించగలిగితిమి. అని సంతో షాంబుధిలో తేలియాడుచు సద్గురు పాదములపై బడి కక్కయ్య స్వామీ ! నేనీ దివ్యదర్శనమును బొందితిని. ఇక అనర్థకంబగు సంసారసాగరంబునబడి ఈదులాడజాలను. నన్నుకూడ మీ కృపాకటాక్షంబున బ్రహ్మైక్యానుసంధానుడ నగునటుల జేయుమని ప్రార్థించెను.

అంతట గురుమూర్తియగు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు ఓయీ కక్కా? నీవీ దేహంబును వదలినచో నీలోని అంతరాత్మ పరమాత్మలో విలీనంబగునే గాని నీకు నిత్యము బ్రహ్మదర్శనభాగ్యం బెటుల లభించును? కనుక నీకీక్షణముతో సంసారసాగరమునగల సమస్తదుఃఖంబులు నివృత్తి అయినవి. నీకునేటినుండి బాహ్య శరీరంబుకూడ దివ్య శరీరమై వెలుగొందగలదు. నీవు నీధర్మపత్నియు చిరకాలము సుఖమగు భగవద్దర్శనమును ఆధ్యాత్మ వ్యాసంగముల జేసికొని తృప్తులగు చుండుడు.

34. కక్కయ్యభార్యను బ్రతికించుట

ఇదియే నీ భార్యయు ఇప్పుడే నిద్రలేచిన పగిది లేవ గలదు. సందేహపడకుమనుచు కక్కని భార్య శరీరముపై మంత్రాక్షతలు, విభూతిజలంబులు జల్లినంతనే - రామపాద స్పర్శచే రాయిగామారిన గౌతముని భార్యయగు అహల్య యేవిధముగ దివ్యమంగళ విగ్రహముగ ప్రత్యక్షమైనదో అదే విధమున ఇటునుండిఅటు పొల్లుచూ అబ్బ యెంతటి సుఖనిద్ర చెందితిని. నేటి నిద్రలో నాకు దివ్యమంగ స్వరూపులగు త్రిమూర్తులు సద్గురుదేవుని దర్శనమైనది.ఎంతటిజన్మసాఫల్యత. ఏమి ఆనందము. అనుచు పూర్వజన్మార్జిత తపఃఫలంబీనాడు ఫలించినదనుచుఅనంతానంద వారాంబుధినందు తేలియాడినది.

ఇంతలో అటయున్న సద్గురుమూర్తి దర్శనము ప్రత్యక్షముగ కనిపించినది. మహాత్మా నా అంతరంగమున గనిపించిన మీరిటు ప్రత్యక్షదర్శన మిచ్చితిరే ఏమి నా అదృష్టము.

అల్పజాతి వారమైన మా గృహమునకు మీ రే కారణమున వచ్చితిరోగాని మా గృహమంతయు పరమపావన మైనది. మా జన్మలే తరించినవనుచు ప్రార్థించుచుండ శ్రీ విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాములవారు

35. కక్కయ్యభార్యను ఆశీర్వదించుట

తల్లీ! నీ సుకృత విశేషము మిక్కిలి కొనియాడ దగినది. నీవంటి పతివ్రతామణులీ లోకము నెంతయో కొలదిగ మాత్రమే యుండగలరు. నీవు మిగులగుణశాలివి.మహాసాధ్వివి. కులముతో పనియేమి. సద్గుణమే ప్రధానము. మహాపుణ్యవతివగుటచే మరల పునర్జన్మ మీదేహముతోడనే యేర్పడినది. నీకును నీ కుటుంబమునకును సర్వమంగళములు కలుగుగాక! యనుచు ఆశీర్వదించెను.

36. కక్కని ఆశీర్వదించుట

కక్కనివైపు దిరిగి నాయనా? కక్కా! నీవునాకు పరమ భక్తుడవు. ఇక పిమ్మట మీ దంపతులుభయులు మా సాన్నిధ్యమున కనిపించుచుండుడు. మీకు సకలైశ్వర్యములు

కూడ నేటితో సిద్ధింపగల వనుచుండగనే- కక్కడు భార్యతో సహా శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారికి ప్రదక్షిణ నమస్కారంబు లర్పించి దేవా! ఈ శరీరంబులు మాయావజ్జీవకాలను మీపాదపద్మములయందుపరమభక్తితో నుండగలవారమనుచూ శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వాములవారిని సాగనంపి వా రానంద భరితులైరి.

37. జీవయాత్ర ముగింపు

ఈ విధముగ శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి పరిపూర్ణానుగ్రహమును బొందిన కక్కని దంపతులు, సద్గురుసేవల నొనర్చుచూ తమ యావజ్జీవితము శ్రీ బ్రహ్మముగారికి దాసానదాసులగుచు కృతకృత్యులై జీవితాంత మున శ్రీస్వాములవారి మఠసామీప్యమునందె జీవయాత్ర ముగించిరి. కక్కడుకూడ గురువుగారివలె శిష్యపరంపరను అపరి మితముగ సంపాదించినందున కక్కని భక్తవర్గము వారందరును శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి మఠ సమీపమునందే యొక హరిజన దేవళముసిర్మించి అందు కక్కని దంపతుల కానందరూపమగు పూజాధ్యానాదుల వారి మతాను

సారము జరుపుచున్నవారైరి. కాలక్రమమున నేడు ఆ కక్కని దేవళము అనంతవైభవములతో విరాజిల్లుచున్నది. శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి మఠమునకు వెళ్ళిన భక్తులందరును కక్కని దివ్యరూపము దర్శించకుండ పోజాలరు. అట్టి విశిష్టమహిమతో కక్కని ఆలయము నేటికిని నెలకొని యున్నది.

